# మంచి వార్త

## సర్కారు కొలువులతోనే మార్పు



**దక్షిణాఫ్రికా** స్వాతంత్ర్య సమరయోధుడు నెల్సన్ మండేలా 'ప్రపంచాన్ని మార్చే శక్తిమంతమైన ఆయుధం విద్య' అంటాడు. విద్యార్థులకు గొప్పగొప్ప తెలివితేటలు ఉన్నప్పటికీ ఆర్థిక సమస్యలు, గ్రామీణ నేపథ్యం కారణంగా ఆ ప్రతిభ మట్టిలో మాణిక్యంలా మిగిలిపోవచ్చు. పెద్ద ఉద్యోగాల్లో స్థిరపడలేక చిన్న కొలువులతో సరిపెట్టుకునే పరిస్థితి రావచ్చు. వారికి కనుక చేయూత అందిస్తే అద్భుతాలు సాధిస్తారు. డాక్టర్ కె. ముత్తు అకాడమీ చారిటబుల్ ట్రస్ట్ సరిగ్గా ఈ పనే చేస్తున్నది. తమిళనాడు పుదుక్కొట్టై ప్రాంతంలో అణగారిన వర్గాల విద్యార్థులకు ఈ ట్రస్ట్ ఉచిత సేవలు అందిస్తున్నది. 2019లో స్థాపించిన ముత్తు అకాడమీ సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల పిల్లలకు తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు సహా వివిధ పోటీ పరీక్షలకు పూర్తి ఉచితంగా శిక్షణ వసతులు కల్పిస్తున్నది. ఇందులో చేరిన విద్యార్థులు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి అకాడమీ పేరు నిలబెడుతున్నారు. ఒక్క గత ఏడాదిలోనే 28 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయంటే ముత్తు అకాడమీ చారిటబుల్ ట్రస్ట్ అంకితభావం ఎంతటిదో తెలుస్తుంది. ఇక ట్రస్ట్ ఆర్థిక నిర్వహణ కూడా పారదర్శకంగా ఉంటుంది. విరాళాలు స్వీకరించరు. అకాడమీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు ఇళమురుగు ముత్తు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఆయన తండ్రి డాక్టర్ కె.ముత్తు అంకితభావం కలిగిన ఉపాధ్యాయుడు. సమాజ సేవకుడు. యాభై ఏండ్లు నిరుపేదలకు సేవ చేశారు. ఇళమురుగు ముత్తుపై తండ్రి ప్రభావం అపారం. అదే, ఆయన మరణం తర్వాత కూడా సేవా కార్యక్రమాల కొనసాగింపునకు స్ఫూర్తినిచ్చింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో తలమునకలుగా ఉంటూనే విద్యాదానం చేస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం ద్వారానే నిరుపేద కుటుంబాల్లో మార్పు సాధ్యమవుతుందని తన నిశ్చితాభిప్రాయం. ఇదే ముత్తు చారిటబుల్ ట్రస్ట్ స్థాపనకు ప్రేరణగా నిలిచింది. ఏ మనిషి జీవితాన్ని అయినా ప్రతిభ, పరిశ్రమే ఉన్నతంగా నిలబెడతాయి.

## వైతాళికుల వాణి

బాల్యంలో మార్కుల నుంచి
వృద్ధాప్యంలో ఆస్తుల వరకు..
జీవితాంతం ఇతరులతో
పోల్చుకుంటూ గడిపేస్తాం.
ఇలా చేస్తున్నామంటే మనల్ని మనం
నాశనం చేసుకుంటున్నట్టే.

• **జిడ్డు కృష్ణమూర్తి**
(ప్రపంచ ప్రసిద్ధ తత్వవేత్త)

## క్యా బాత్‌హై!

